# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఉత్తరప్రదేశ్‌లోని గురు గోరఖ్‌నాథ్ ఆయుష్ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రారంభించారు.

- ❖ ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడంలో డిజిటల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ❖ లక్ష కోట్ల రూపాయల నిధులతో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ (ఆర్‌డీఐ) పథకానికి కేంద్రమంత్రి వర్గం ఈరోజు ఆమోదం తెలిపింది.

- ❖ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు త్వరలో విజయవంతంగా ముగుస్తాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

- ❖ తెలంగాణలోని పాశమైలారం ఫార్మా పరిశ్రమలో నిన్న జరిగిన పేలుడు ప్రమాదంలో మృతుల సంఖ్య 36కి చేరింది.

=========================

ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో గురు గోరఖ్‌నాథ్ ఆయుష్ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాన్ని భారతదేశ ప్రాచీన సంప్రదాయాలు, విలువలకు ఆధునిక కేంద్రంగా అభివర్ణించారు. ఈ సంస్థ ఉత్తరప్రదేశ్‌లోనే కాకుండా దేశ వ్యాప్తంగా ఆరోగ్య సేవల రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందాలంటే యోగా వంటి పురాతన ఆరోగ్య పరిరక్షణ సంప్రదాయాలను అవలబించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

=========================

ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించడంలో డిజిటల్ ఇండియా చొరవ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం ఈరోజుతో 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. డిజిటల్ ఇండియా చొరవ ఒక ప్రజా ఉద్యమంగా మారి, డిజిటల్ భారతదేశ సాధికారతకు దోహదపడిందన్నారు. భారతదేశాన్ని ప్రపంచానికి విశ్వసనీయ ఆవిష్కరణ భాగస్వామిగా మార్చడంలో డిజిటల్ ఇండియా కారణమయ్యిందన్నారు. సాంకేతికత వినియోగంలోనూ ఇది ముఖ్య భూమిక పోషించిందన్నారు. భారతదేశపు 5G విస్తరణ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వాటిలో ఒకటి అని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

==========================

పరిశోధన రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా లక్ష కోట్ల రూపాయల విలువైన పరిశోధనలు అభివృద్ధి, ఆవిష్కరణ (ఆర్‌డిఐ) పథకానికి కేంద్రమంత్రి వర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలను పెంచడం, క్రీడాకారుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా జాతీయ క్రీడా విధానం-2025కు క్యాబినెట్ ఆమోదం లభించింది. దీంతో పాటు ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి సైతం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తద్వారా తయారీ రంగంలో ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వనుంది. ఇతర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

==========================

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారం వద్ద ఫార్మా పరిశ్రమలో నిన్న జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 36కి చేరింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఫ్యాక్టరీ పేలుడు ప్రదేశాన్ని సందర్శించి ఉన్నత అధికారులతో పరిస్థితిపై సమీక్షించారు. పేలుడుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రమాద ఘటన పరిస్థితులను మంత్రులు, జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు, గాయపడిన వారికి 10 లక్షల రూపాయల పరిహారం ప్రకటించారు. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం DNA పరీక్ష ద్వారా మృతులను గుర్తించడానికి చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 11 మంది మృతులను గుర్తించామని అధికారులు వెల్లడించారు. పేలుడు జరిగినప్పుడు కార్మికులు సహా దాదాపు 143 మంది విధుల్లో ఉన్నారు.

విరామం

==========================

భారత్ - అమెరికా దేశాల మధ్య సంబంధాలు బలంగా ఉన్నాయని.. సాంకేతికత, వాణిజ్యం, విద్య, భద్రత రంగాలలో పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ... గత 25 సంవత్సరాలుగా భారతదేశం, అమెరికాతో బలమైన, సానుకూల" సంబంధాలను కలిగి ఉందని పేర్కొన్నారు. ఇరు దేశాలు క్లిష్టమైన వాణిజ్య చర్చలలో ఉన్నాయని, త్వరలో వీటిని విజయవంతంగా ముగుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్లిష్ట ద్వైపాక్షిక సంబంధాలలో సమస్యలు అనేవి అనివార్యమని, అయితే వాటిని పరిష్కరించే సామర్థ్యం ఇరుపక్షాలకు ఉండాలని... ఆ వైఖరిని సానుకూల దిశలో కొనసాగించాలని జైశంకర్ పేర్కొన్నారు.

==========================

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే మూడు నూతన నేర చట్టాలు రాబోయే రోజుల్లో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మారుస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా

అన్నారు. ఈ చట్టాలు అమలులోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ... ఈ వ్యవస్థ పూర్తిగా అమలు కావడానికి గరిష్టంగా మూడు సంవత్సరాలు పడుతుందన్నారు. భారతదేశ నేర న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య న్యాయం పొందడానికి జాప్యమవ్వడం అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో ఈ చట్టాలు పూర్తిగా అమలయితే ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన మూడు సంవత్సరాలలోపు న్యాయం జరుగుతుందని అమిత్ షా పేర్కొంటూ..

(వాయిస్ 36 సెకన్లు)

==========================

బ్యాంకింగ్ సేవలను అందించడంలో ఎస్‌బీఐ 70 సంవత్సరాల పూర్తి చేసుకున్నందున కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అభినందనలు తెలిపారు. 23 వేలకు పైగా శాఖలు, 78 వేల కస్టమర్ సర్వీస్ పాయింట్లు (CSPలు) 64 వేల ATMలతో SBI ఎంతో బలోపేతమయ్యిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. గత దశాబ్దంలో ఇది సాధించిన డిజిటల్ పరివర్తనతో వినియోగారులకు ఎంతో ప్రయోజనం చేకూర్చిందన్నారు. 1.5 కోట్ల మంది రైతులకు, మహిళల నేతృత్వంలోని 1.3 కోట్ల స్వయం సహాయక బృందాలకు, పిఎం స్వనిధి కింద 32 లక్షల మంది వీధి వ్యాపారులకు, 23 లక్షల ఎంఎస్ఎంఇలకు, వివిధ పథకాల ద్వారా లక్షలాది మంది చేతివృత్తుల వారికి ఎస్‌బీఐ రుణాలను ఇస్తోందని పేర్కొన్నారు.

==========================

ప్రయాణీకుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ఈరోజు “రైల్ వన్” యాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (CRIS) స్థాపన దినోత్సవం సందర్భంగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... రైల్ వన్ యాప్ తో ప్రయాణీకుల అన్ని సేవలకు ఒకే చోట పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ యాప్ టిక్కెట్ల కొనుగోలు, రైళ్ల సమాచారం, PNR, జర్నీ ప్లానింగ్, రైలులో ఆహారం వంటి సేవలను సులభతరం చేస్తుందన్నారు. ప్రయాణీకులు రైల్ వన్ యాప్ ద్వారా రిజర్వ్ చేయని టికెట్‌ను బుక్ చేసుకోసే అవకాశం కూడా ఉందని అశ్వని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 39 సెకన్లు)

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుంచి 8 రోజుల పాటు 5 దేశాల్లో పర్యటించనున్నారు. అర్జెంటీనా, బ్రెజిల్, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, నమీబియాల్లో ప్రధానమంత్రి పర్యటిస్తారని విదేశీ వ్యవహాల శాఖ సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపారు.

==========================
==========================